## క్లుప్తంగా

### వసతి గృహంలో సౌకర్యాలపై ఆరా



వసతులపై వార్డెన్‌ను ప్రశ్నిస్తున్న జడ్జి బులికృష్ణ

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–10లోని గిరిజన విద్యార్థినుల వసతి గృహాన్ని సోమవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి బులికృష్ణ సందర్శించారు. వసతులు, మెనూ అమలుపై ఆరా తీశారు. విద్యార్థినులకు అందిస్తున్న సౌకర్యాలు, తదితర అంశాలపై వసతిగృహ వార్డెన్ ఝాన్సీని ప్రశ్నించారు. అనంతరం ఆయన విద్యార్థులతో సమావేశమయ్యారు. సౌకర్యాలపై అభిప్రాయాలతో పాటు సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

### ఐదు సోలార్ దీపాల ఏర్పాటు



ఆరిలోవ 40 గజాల కాలనీ శ్మశానం వద్ద ఏర్పాటు చేసిన సోలార్ దీపం

ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో ఇండో గ్లోబల్ సోషల్ సర్వీసెస్ సొసైటీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సహకారంతో ఐదు చోట్ల సోలార్ దీపాలు ఏర్పాటు చేశారు. ఆరిలోవ 40 గజాల కాలనీని ఆనుకుని హిందూ, ముస్లిం, క్రిస్టియన్ శ్మశానవాటికలు పక్కపక్కనే ఉన్నాయి. వాటిలో ఇంతవరకు వీధి దీపాలు లేవు. ఈ మేరకు ఆ సంస్థల ప్రతినిధులు ఆయా శ్మశానాల్లో ఒక్కొక్కటి చొప్పున సోలార్ దీపాలు ఏర్పాటు చేశారు. మిగిలిన రెండింటిలో ఒకటి ఆఖరి బస్ స్టాప్‌లో జీవీఎంసీ ఓపెన్ జిమ్ వద్ద, ఇంకొకటి ముడసర్లోవ రోడ్డులో యూపీహెచ్‌సీ సమీపం నూకాలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేశారు. వీటిని ఏర్పాటు చేయడానికి కృషి చేసిన కార్పొరేటర్ కెల్ల సునీత, వైఎస్సార్‌సీపీ నాయకులకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

### నోటి ఆరోగ్యంపై శ్రద్ధ అవసరం

మహారాణిపేట: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవాన్ని సోమవారం రేసపువానిపాలెంలోని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ ఆదేశాల మేరకు నిర్వహించిన నేషనల్ ఓరల్ హెల్త్ డేలో డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు మాట్లాడుతూ నోటి శుభ్రతతోనే ప్రజల ఆరోగ్యం సాధ్యమన్నారు. దంతాల పరిశుభ్రత, నోటి ఆరోగ్యానికి తీసుకోవాల్సిన సంరక్షణ చర్యలపై అవగాహన అవసరమన్నారు. అనంతరం పోస్టర్ ఆవిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు డాక్టర్ సమత, తదితరులు పాల్గొన్నారు.

### సచివాలయంలో జీవీఎంసీ పీడీ తనిఖీలు



సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న పీడీ పాపినాయుడు

సీతంపేట: జీవీఎంసీ జోన్–5 పరిధిలోని శ్రీనివాసనగర్–1 వార్డు సచివాలయంలో సోమవారం జీవీఎంసీ పీడీ పాపినాయుడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ సిబ్బంది పనితీరు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. అక్కడకు వచ్చిన వారితో మాట్లాడి సిబ్బంది సేవలపై ఆరా తీశారు. ప్రజలకు అన్ని రకాల సేవల అందుబాటులో ఉండాలని, ప్రతి రోజూ స్పందన నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సచివాలయ సిబ్బందికి పీడీ పలు సూచనలిచ్చి, వారి సందేహాలను నివృత్తి చేశారు. ఏపీడీ పద్మావతి పాల్గొన్నారు.

# అరకొర నిర్వహణే శాపం!



అపరిశుభ్రంగా ఉన్న పార్కు లోపల పరిసరాలు



పార్కులో క్రికెట్ ఆడుతున్న ఆకతాయి యువకులు

- అధ్వానంగా ఎంవీపీ కాలనీ రాజీవ్ పార్కు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

ఎంవీపీ కాలనీ: స్థానిక సెక్టార్–6లో రాజీవ్ పార్కు పరిసరాలు అధ్వానంగా మారాయి. కాలనీవాసుల సౌకర్యార్థం దశాబ్దాల కిందట నిర్మించిన ఈ పార్కు నిర్వహణపై ఆది నుంచి జీవీఎంసీ అధికారులు నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తున్నారు. పార్కులో ఎక్కడ చూసినా చిందరవందరగా ఉన్న పరిసరాలు, క్షీణించిన పారిశుధ్యం, ఖాళీ మద్యం సీసాలే దర్శనమిస్తున్నాయి. కోవిడ్‌కు ముందు లక్షల వ్యయంతో ఈ పార్కును పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశారు. నడక మార్గాన్ని ఆధునికీకరించారు. అయితే ఆయా అభివృద్ధి పనులకు అనుగుణంగా జీవీఎంసీ నిర్వహణ చేపట్టకపోవడం పార్కుకు



పార్కులో పడేసిన ఖాళీ మద్యం సీసాలు

శాపంగా మారింది. రోజురోజుకూ పార్కు పరిసరాలు మరింత అధ్వానంగా తయారవుతున్నాయి.

**నిరుపయోగంగా క్రీడా సముదాయం**

జీవీఎంసీ ఏడాది క్రితం ప్రతి కార్పొరేటర్‌కు రూ.5 లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు స్థానిక కార్పొరేటర్ తనకు మంజూరైన నిధులతో రాజీవ్ పార్కులో క్రీడా సముదాయాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. రాజీవ్ పార్కు పూర్తి స్థాయి వినియోగంలోకి తేవాలనే స్థానికుల అభ్యర్థన మేరకు వ్యాయామ సామగ్రిని ఏర్పాటు చేశారు. ఇంత వరకు బాగానే ఉన్నా ప్రస్తుతం పార్కు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రాత్రి పూట మందుబాబులకు ఈ పార్కు అడ్డాగా మారింది. క్రీడా సముదాయం సదుపాయాలు వినియోగించుకునేందుకు కూడా స్థానికులు మోహం చాటేస్తున్నారు. పార్కులో క్రికెట్ వంటి ఆటలు ఆడకూడదంటూ జీవీఎంసీ హెచ్చరికలు జారీ చేసినా స్థానిక ఆకతాయి యువకులు పట్టించుకోవడం లేదు. బోర్డులు పెట్టిన చోటే క్రికెట్‌తో పాటు ఇతర క్రీడలు ఆడుతూ పార్కులో పరిసరాలను అధ్వానంగా మారుస్తున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ పార్కుల విభాగం అధికారులు స్పందించి రాజీవ్ పార్కు నిర్వహణ చేపట్టి, సెక్యూరిటీ గార్డును నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

## పిచ్చుకల పరిరక్షణ అందరి బాధ్యత

ఏయూ క్యాంపస్: విద్యార్థులను భాగస్వాములను చేస్తూ ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని సోమవారం ఏయూ తెలుగు మీడియం, జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్రాంత డిప్యూటీ తహసీల్దార్ తిరునగరి సాయిప్రకాష్ మాట్లాడుతూ గతంలో ప్రతి ఇంటి వద్ద ఉదయం నిద్రలేవగానే కళ్ల ముందు కనిపించే చిన్ని నేస్తం పిచ్చుక అన్నారు. నేడు ఆ చిన్ని నేస్తం పల్లెల్లో సైతం అరుదుగా కనిపిస్తున్నాయన్నారు. కాంక్రీట్ భవనాలు, సెల్ టవర్లు పెరిగిపోవడం, అభివృద్ధి అనే పేరుతో జరుగుతున్న విధ్వంసంలో పిచ్చుకల సంతతి తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. పిచ్చుకలను కాపాడుకోవడం అందరూ బాధ్యత తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు.

గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జె.వి.రత్నం మాట్లాడుతూ పక్షులకు గూళ్లు, నీరు, ఆహారం ఏర్పాటు చేయాలన్నారు. జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వనిత మాట్లాడుతూ నిరంతరం



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు చదువుతో పాటు పర్యావరణ పరిరక్షణ, సమాజంలో నడుచుకునే విధానం వివరిస్తున్నామన్నారు. ఏయూ తెలుగు మీడియం హైస్కూల్ హెచ్‌ఎం సలోమి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతలో పిచ్చుకల పరిరక్షణ భాగమన్నారు. ఈ కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని ప్లకార్డులు ప్రదర్శిస్తూ పిచ్చుకలను పరిరక్షించాలి అంటూ నినాదాలు చేశారు.

## నేడు నూకాలమ్మ పండగ



రూరల్ తహసీల్దారు కార్యాలయం వద్ద నూకాలమ్మ

ఆరిలోవ: పాత ఆరిలోవ ప్రాంతంలో నూకాలమ్మ పండగ మంగళవారం జరగనుంది. ఆలయాన్ని ఇప్పటికే నిర్వాహకులు పచ్చనికొమ్మలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు. ఆరిలోవ పోలీసులు కూడా బందోబస్తు నిర్వహించనున్నారు. దీంతో పాటు డెయిరీఫారం సమీపం రూరల్ మండలం కార్యాలయం ఎదురుగా ఉన్న నూకాలమ్మ అలయం పండగ కోసం సిద్ధమైంది. ఇందిరానగర్, వెటర్నరీ కాలనీ, హనుమంతవాక, డెయిరీఫారం ప్రాంతాల భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

## జాతీయ సమైక్యత శిబిరానికి కృష్ణా కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ అధికారి



పోలా ఉమామహేశ్వరరావు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం అధికారి డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ సమైక్యత శిబిరానికి ఎంపికయ్యారు. ఒడిశా రాష్ట్రం పూరీలో ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకూ ఏడు రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో ఆయన పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. ఉమామహేశ్వరరావుతో పాటు ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎంపికైన ఎనిమిది మంది వలంటీర్లు ఈ శిబిరంలో పాల్గొన్నారన్నారు.

# రహదారులు జలమయం



పెదగదిలి నుంచి తోటగరువు మధ్యలో బ్రిడ్జిపై నిలిచిన వర్షపు నీరు

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో సోమవారం సాయంత్రం కుండపోతగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి. కాలువలు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాలు, కూడళ్ల వద్ద వర్షపు నీరు నిలిచిపోయింది. వాహనాల రాకపోకలకు ఆటంకం కలిగింది. బీఆర్‌టీఎస్‌లో పెదగదిలి కూడలి వద్ద కొండపై నుంచి వచ్చిన వరద నీరు పెద్ద ఎత్తున నిలిచిపోయింది. ఇక్కడ పోలమాంబ గుడి నుంచి కూడలిలో బడ్డీల వరకు నీరు చేరింది. సుమారు రెండు అడుగులకు పైగా నీరు నిలిచిపోవడంతో వాహనచోదకులు ఇబ్బందిపడ్డారు. ఈ కూడలి నుంచి తోటగరువుకు వెళ్లే రహదారి మధ్యలో గెడ్డపై ఉన్న బ్రిడ్జిపై కూడా వర్షపు నీరు నిలిచిపోయింది. చినగదిలి కూడలి నుంచి అంబేడ్కర్‌నగర్, టీబీసీ పాయింట్ వెళ్లే రహదారిలో నార్త్ షిర్డీ సాయిబాబా ఆలయం సమీపం, సూర్యతేజానగర్ వద్ద రోడ్డు జలమయమైంది. కాలువలు పొంగి పొర్లడంతో మురుగునీరు రహదారులపైకి చేరడంతో స్థానికులు రాకపోకలకు నానా అవస్థలు పడ్డారు.

**బోసిపోయిన వారపు సంత**

మద్దిలపాలెం: ఉరుములతో కూడిన జోరువాన కారణంగా మద్దిలపాలెంలో రహదారులు, వీధులు జలమయమయ్యాయి. ప్రతి సోమవారం పిఠాపురం కాలనీలో జరిగే వారపు సంత బోసిపోయింది. చిరు వ్యాపారులు సంతకు వచ్చి వర్షం కారణంగా నిరుత్సాహంతో వెనుదిరిగారు. కూరగాయలు కొనేవారు లేక వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఇసుకతోట, హెచ్‌బీకాలనీ, మద్దిలపాలెం, కేఆర్‌ఎం కాలనీ, పిఠాపురం కాలనీలో కాలువలు వర్షపు నీటితో పొంగిపొర్లాయి. పిఠాపురం కాలనీ రోడ్డు విస్తరణ కోసం తవ్వి గోతుల్లో వర్షపు నీరు చేరి బురదమయంగా మారింది.

## కృష్ణా కళాశాలలో 9 మంది గైర్హాజరు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ కళాశాలలో సోమవారం జరిగిన ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం బోటనీ పరీక్షకు 9 మంది గైర్హాజరయ్యారు. కృష్ణా జూనియర్ కళాశాలలోని సెంటర్–ఏలో పరీక్షకు 680 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. ఒకరు గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ నాగమణి తెలిపారు. కృష్ణా డిగ్రీ కళాశాలలోని బీ సెంటర్‌లో 682 మంది పరీక్ష రాయాల్సి ఉండగా.. 8 మంది గైర్హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ఆర్.వి.వి.సూర్యకుమారి తెలిపారు.

# నిరసనలు.. విన్నపాలు



కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు



ధర్నా చేస్తున్న పంచాయతీ స్వచ్ఛ భారత్, కాంట్రాక్టు కార్మికులు

మహారాణిపేట: తమ సమస్యల పరిష్కారం కోరుతూ పలు సంఘాల ప్రతినిధులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలు చేపట్టారు. చదువుకున్న మహిళలకు ఉపాధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ సోమవారం దళిత మహిళా శక్తి సంఘం ఆధ్వర్యంలో పలువురు మహిళలు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షురాలు జి.మరియమ్మ, జిల్లా సహాయ కార్యదర్శి బాలయోగి, తదితరులు పాల్గొన్నారు.

**జీవో నం–1 రద్దుకు డిమాండ్**

జీవో నంబర్ 1ను తక్షణం రద్దు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. అనంతరం కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు, నాయకులు ఎస్.నారాయణ, ఆర్.పవన్, యు.నాగరాజు, దేవ ప్రసాద్ పాల్గొన్నారు

**పంచాయతీ కార్మికుల ఆందోళన**

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఏపీ యునైటెడ్ గ్రామ పంచాయతీ శానిటరీ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) విశాఖ జిల్లా ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట గ్రామ పంచాయతీ స్వచ్ఛ భారత్, కాంట్రాక్టు కార్మికులు ఆందోళన చేశారు. పంచాయతీల్లో పారిశుధ్యం పనులు చేస్తున్న స్వచ్ఛ భారత్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. ఆరు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్ మల్లికార్జునకు అందజేశారు.

**హమాలీలు ధర్నా**

సివిల్ సప్లయిస్ హమాలీలు కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఏపీ స్టేట్ సివిల్ సప్లయిస్ హమాలీస్ యూనియన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో పీఎఫ్, పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. పలు సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. యూనియన్ నాయకులు ఎం.మన్మథరావు, పైల అప్పారావు, ఎం.వెంకటరమణ, సన్యాసినాయుడు పాల్గొన్నారు.



కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న హమాలీలు

## గుర్తు తెలియని వ్యక్తి మృతి



అల్లిపురం: గుర్తు తెలియని వ్యక్తి కేజీహెచ్‌లో మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాలివి.. ఆర్టీసీ కాంప్లెక్స్ బస్ స్టాపు వద్ద గుర్తు తెలియని వ్యక్తి సోమవారం ఉదయం అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. స్థానికుల సమాచారం మేరకు 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌లో చేర్పించారు. అక్కడి డాక్టర్లు పరీక్షించి, అప్పటికే ఆ వ్యక్తి మృతి చెందినట్లు తెలిపారు. మృతి చెందిన వ్యక్తికి సుమారు 35 సంవత్సరాలు ఉంటాయని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94903 91090, 0891–278362 ఫోన్ నంబర్లలో తెలియజేయాలని కోరారు.

## ఎర్నిమాంబ హుండీ ఆదాయం లెక్కింపు



డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురంలో గల ఎర్నిమాంబ అమ్మవారి ఆలయంలో సోమవారం దేవాదాయ శాఖ సిబ్బంది, శ్రీహరి స్వచ్ఛంద సేవకులు హుండీల లెక్కింపు నిర్వహించారు. 25 రోజులకు అమ్మవారి దర్శనాలకు సంబంధించిన హుండీల ఆదాయం రూ.9,02,595లు, 91 గ్రాముల బంగారం, 7 కేజీల 380 గ్రాముల వెండి వచ్చినట్లు దేవాదాయశాఖ ఆలయ కార్యనిర్వహణాధికారి సురేష్ బాబా తెలిపారు. దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.ప్రసన్నలక్ష్మి పర్యవేక్షణలో ఆదాయం లెక్కించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు గవర రమణ, కె.ఉమమహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## డెయిరీ ఫారం వద్ద బస్ స్టాప్ ఏర్పాటుకు వినతి



ఎంపీ ఎంవీవీకి వినతి పత్రం అందిస్తున్న పతివాడ వెంకటలక్ష్మి

ఆరిలోవ: ప్రయాణికుల సౌకర్యార్థం జాతీయ రహదారిపై డెయిరీఫారం వద్ద బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణకు విద్యా విభాగం డైరెక్టర్ పతివాడ వెంకటలక్ష్మి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఆదర్శనగర్, రవీంద్రనగర్, డెయిరీఫారం, విశాలాక్షినగర్ ప్రాంతాలకు చెందినవారు మధురవాడ, ఆనందపురం, భీమిలి వెళ్లడానికి డెయిరీఫారం వద్ద గతంలో ఉన్న బస్ స్టాప్‌లో జీవీఎంసీ వాహనాల మెకానిక్ షెడ్ ఏర్పాటు చేశారని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఇక్కడ బస్‌లు ఆపడంలేదని వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనికి ప్రత్యామ్నాయంగా డెయిరీఫారం పెట్రోల్ బంక్ దాటిన తర్వాత ఇందిరానగర్ ఆర్చ్ సమీపంలో పార్లమెంట్ నిధులతో కొత్తగా బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని వారు ఎంపీని కోరారు.

# దళిత ఎమ్మెల్యేపై టీడీపీ దాడి దారుణం



వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

మహారాణిపేట: అసెంబ్లీలో దళిత ఎమ్మెల్యే సుధాకర్‌పై టీడీపీ ఎమ్మెల్యేలు దాడి చేయడాన్ని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల ఓ ప్రకటనలో ఖండించారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుతో పాటు ఆ పార్టీ ఎమ్మెల్యేలు శాసనసభలో వ్యవహరిస్తున్న తీరు దారుణమన్నారు. ప్రజా సమస్యలపై చర్చ జరుగుతున్న సమయంలో స్పీకర్ పోడియంపైకి వెళ్లి పేపర్లు విసిరిన చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన సాగుతుంటే టీడీపీ నాయకులు చూసి ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు. విశాఖపట్నం కేంద్రంగా జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్ విజయవంతం కావడం, దేశంలోనే అగ్రగామి పెట్టుబడుదారులు విచ్చేసి ఎన్నో పరిశ్రమలు నెలకొల్పడాన్ని చంద్రబాబు, టీడీపీ ఎమ్మెల్యేలు తట్టుకోలేకపోతున్నారని పేర్కొన్నారు.

## ఏయూ సమాచారం..

### 'జీవితాన్ని ఉన్నతంగా మలచుకోవాలి'



పుస్తకాన్ని బహూకరిస్తున్న విభాగాధిపతి ఆచార్య జాలాది రవి

ఏయూ క్యాంపస్: జీవితాన్ని ఉన్నతంగా మలచుకోవాలని క్రీడా పరిశోధకుడు, కమ్యూనిటీ సైకాలజిస్ట్ సుంకర నాగేంద్ర కిషోర్ అన్నారు. సోమవారం ఏయూ ఎంబీఏ విభాగంలో నిర్వహించిన కార్యక్రమంలో 'మాస్టర్ యువర్ లైఫ్'అనే అంశంపై ఆయన మాట్లాడారు. యువత ప్రధానంగా తమలోని అంతర్గత శక్తిని, సామర్థ్యాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. నిత్య వ్యాయామం, పుస్తక పఠనం, తగినంత నిద్ర, మంచి ఆహారపు అలవాట్లను కలిగి ఉండాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య జాలాది రవి మాట్లాడుతూ ఆశావాద దృక్పథంతో యువత నడవాలన్నారు. తద్వారా ఉజ్వల భవితను సొంతం చేసుకోవడం సాధ్యపడుతుందన్నారు. అనంతరం కిషోర్‌ను విభాగం తరఫున సత్కరించారు. కార్యక్రమంలో విశ్రాంత ఆచార్యులు డాక్టర్ శ్రీజ్యోతి సేవలను గుర్తు చేసుకుని నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ బి.సుబ్బయ్య, అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఏయూ ప్రగతిపై పూర్వ విద్యార్థుల హర్షం



వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన పూర్వ విద్యార్థులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల 1979–83 బ్యాచ్ విద్యార్థులు సోమవారం వర్సిటీని సందర్శించారు. ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డితో సమావేశమయ్యారు. ఏయూను నూతన లక్ష్యాల దిశగా నడిపిస్తున్న విధానంపై హర్షం వ్యక్తం చేశారు. వర్తమాన తరం విద్యార్థులను పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్న విధానం, విద్యార్థులను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే దిశగా తీసుకుంటున్న చర్యలను వీసీ ప్రసాదరెడ్డి వివరించారు. అనంతరం పూర్వ విద్యార్థుల సహకారంతో చేపట్టిన హాస్టల్ భవనం నిర్మాణాన్ని వారు పరిశీలించారు.

## రాష్ట్రంలో తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలి



జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు వినతిపత్రం అందిస్తున్న తూర్పు కాపు సంఘం నాయకులు

మద్దిలపాలెం: రాష్ట్రంలో తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాలని కోరుతూ జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ గంగారామ్‌ను న్యూఢిల్లీలో సోమవారం ఎంపీ జీవీఎల్ నరసింహారావు ఆధ్వర్యంలో కలిసి తూర్పు కాపు సంఘం నాయకుడు గొర్లె శ్రీనివాసరావు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా తూర్పు కాపులకు ఓబీసీ రిజర్వేషన్ కల్పించాల్సిన ఆవశ్యకతను జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌కు జీవీఎల్ వివరించారు. విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలో ఉంటున్న తూర్పు కాపులకు మాత్రమే ఓబీసీ రిజర్వేషన్ కల్పిస్తున్నారని, రాష్ట్రంలోని మిగతా జిల్లాల్లోని తూర్పు కాపులకు ఆ అవకాశం లేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో సంఘం నాయకులు రామారావు, కరణంరెడ్డి నరసింగరావు ఉన్నారు.

## మామిడి పండ్లకు గిరాకీ



సీతమ్మధార రైతుబజార్‌లో పరియాలు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లో మామిడి పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. సాధారణంగా ఉగాది మొదటి వారం నుంచి మామిడి పండ్ల(పరియాలు రకం) విక్రయాల మొదలు పెడతారు. తెలుగు సంవత్సరాదిని పురస్కరించుకుని ఆలయంలో, ఇంట్లోని దేవుడి సన్నిధిలో మామిడి పండ్లు ఉంచుతారు. ఈ నేపథ్యంలో పరియాలు రకం పండ్లకు గిరాకీ పెరిగింది. రైతుబజార్‌లో కిలో రూ.90 చొప్పున విక్రయిస్తున్నారు.

## కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన నేడు

డాబాగార్డెన్స్: విశాఖ వాసుల ఆరాధ్యదైవం కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ స్వర్ణ పుష్పార్చనలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లకు ఫోన్ చేయవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబరు 060810011006681 టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు.

## 'స్పందన'కు 16 అర్జీలు

సీతమ్మధార: సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 16 అర్జీలు అందాయి. ప్రజల నుంచి వాటిని తహసీల్దార్, మండల ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ పేర్ల శ్యామ్‌ప్రసాద్ స్వీకరించి పరిశీలించారు. వినతుల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకుంటామన్నారు. కుల, ఆదాయ, నివాస, కుటుంబ సభ్యత్వ ధ్రువీకరణ పత్రాల కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నారు.